
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 14 ఆగస్టు 2023
5
తిరుపతి



నేడు హై లెవల్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - తిరుమల : టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హైలెవల్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి, కలెక్టర్, ఎస్పి, అటవీ శాఖ అధికారులు హాజరుకానున్నారు. నడకదారి భక్తుల భద్రతపై టిటిడి దృష్టి పెట్టింది. నడకదారి భక్తులకు జారీ చేసే టోకెన్ల విధానాన్ని రద్దు చేసి, సర్వదర్శనం టోకెన్లు పెంచే యోచనలో టిటిడి ఉంది. సర్వదర్శనం భక్తులకు ప్రస్తుతం జారీ చేస్తున్న 15వేల టోకెన్ల సంఖ్యను 30వేలకు పెంచే యోచనలో టిటిడి ఉంది. కేవలం మొక్కులు ఉన్నవారే నడకమార్గంలో వస్తారని టిటిడి భావిస్తోంది.

నడకమార్గంలో మళ్లీ కనిపించిన చిరుత

నడకమార్గంలో 2450 మెట్టు వద్ద చిరుతపులి కనిపించడంతో టిటిడి మరోసారి ఉలిక్కిపడింది. ఘటనా స్థలానికి అటవీ అధికారులు చేరుకున్నారు. ఏడో మైలు వద్ద నుంచి నరసింహస్వామి ఆలయం వరకూ గుంపులు గుంపులుగా భక్తులను టిటిడి అనుమతిస్తోంది.

నడకదారిలో నిబంధనలు ఇవే..!

ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకే...

చంటిపిల్లలు ఉంటే మధ్యాహ్నం 2 వరకే

ద్విచక్రవాహనాలకూ షరతులు వర్తింపు



శాశ్వత చర్యలు సరే...!

భక్తుల్లో అవగాహన ఏది..?

నడకదారుల్లో ఎక్కడా కానరాని సూచిక బోర్డులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలన్నీ అటవీ మార్గాల్లోనే ఉన్నాయి.. శ్రీశైలం నల్లమల అడవుల సమీపంలో ఉంది. అయితే ఇప్పటివరకూ ఒక్క వన్యప్రాణి కూడా భక్తుల జోలికి రాలేదు. కేరళ రాష్ట్రం శబరిమలై ఆలయం అటవీ మార్గంలోనే వెళ్లక తప్పదు. అయితే అక్కడా ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భద్రతా చర్యల వల్ల వన్యమృగాల భారిన భక్తులు పడే అవకాశమే లేదు. అయితే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమల పుణ్యక్షేత్రంలో వరుస ఘటనలు ఎందుకు జరుగుతున్నాయో టిటిడి సమీక్షించాల్సి ఉంది. అంతేకాదు శాశ్వత పరిష్కారం చూపేలోపు భక్తుల్లో అవగాహన పెంచి వన్యప్రాణుల నుంచి భక్తులను కాపాడాల్సి ఉంది.

తిరుమల నడకదారి ప్రకృతితో పరవశిస్తూ వెళ్లే మార్గం. అయితే వరుసగా జరిగిన రెండు ఘటనలతో భక్తులు బెంబేలెత్తే పరిస్థితి. శనివారం జరిగిన ఘటన అత్యంత విషాదకరం. తిరుమల నడకదారిలో మొదటి ఘటనలో బాబుపై చిరుతపులి దాడిచేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. రెండో ఘటనలో ఏం జంతువన్నది ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. పులి, చిరుతపులి లాంటి వన్యప్రాణులు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప మనుష్యులపై దాడి చేయవన్నది వాస్తవం. కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా అడవుల్లో పులుల దాడుల నుంచి తప్పించుకోవచ్చు. తిరుమలలో జరిగిన రెండు ఘటనల్లోనూ పిల్లలు తల్లిదండ్రుల దృష్టిని దాటి పక్కకు వెళ్లినవారే. మొదటి ఘటనలో బాలుడు నడకమార్గం దాటి అడవిలో కూర్చుని ఆటలాడుకునే సందర్భంలో బాబు వంగి ఉండటం వల్ల జంతువనుకుని భ్రమపడి దాడిచేసి ఉంటాయన్నది వాస్తవం. ఇక రెండో ఘటనలో లక్షిత తండ్రి పర్యవేక్షణ పరిధి దాటి అడవిలోకి వెళ్లినట్లు అర్ధమవుతోంది. అయితే అడవిలో ఏ జంతువు దాడి చేసి ఉంటుందో స్పష్టత లేదు. బాలిక శరీరంలో కొంత మాంసాన్ని ఏదో జంతువు తిన్నట్లుగా అర్ధమవుతోంది. చిరుతపులి ఆహారం కోసం దాడిచేసి ఉంటే శరీరాన్ని అలా వదిలి వెళ్లదు. తనతో పాటే ఖచ్చితంగా తీసుకెళుతుంది. ఎలుగుబంటి దాడిచేసిందా, నక్క, మైనా వంటివి తిని ఉండే అవకాశం ఉందా? అన్నది సిసి కెమెరాల్లో చిక్కితేనే తెలుస్తోంది. ఒకవేళ టిటిడి చెబుతున్నట్లుగా మానవ రక్తాన్ని పులి మరిగితే మాత్రం ఎప్పటికైనా భక్తులకు ప్రమాదమే. విస్మరించకుండా పరిష్కారం చూడాల్సి ఉంది. ఏదిఏమైనా కాలినడకన నడిచే భక్తులకు అడవి జంతువుల గురించి అవగాహన కల్పించడం అవసరం. పిల్లలు ఎటువంటి పరిస్థితుల్లోనూ ఒంటరిగా ఉండకుండా చూసుకోవాలి. శ్రీశైలానికి ప్రతి ఏటా ఉగాది బ్రహ్మోత్సవాలకు కర్ణాటక,మహారాష్ట్ర లనుంచి 10లక్షలకు పైగా భక్తులు నల్లమల అడవుల్లో నడిచి వెళుతుంటారు. ఇది ఎపుడో 15వ శతాబ్ది నుంచి జరుగుతున్నదే. అయితే ఇంతవరకు ఈ యాత్రలో ఒక్క మరణం కూడా వన్య ప్రాణుల నుంచి జరగ లేదు. భక్తులకు వన్య ప్రాణుల పట్ల అవగాహన పెంచుకోవడం అవసరం. ఉదాహరణకు శ్రీశైల పాద యాత్రికులు తప్పని సరిగా ఉత కర్రలు తీసుకు వెళతారు. ఈ కర్రలు చేత్తో పట్టుకుని నడవడం వల్ల వన్య ప్రాణులకు తాము చూసే మనిషి మరింత భారీగా, కనపడతాడు. అందు వల్ల అవి దాడి చేయడానికి జంకుతాయి. ఎటువంటి పరిస్థితుల్లోనూ అడవుల్లో కూర్చొని సేద తీరే యత్నం చేయ కూడదు. కూర్చుంటే మీరు నాలుగు కాళ్ళ జంతువులా కనపడి వన్య ప్రాణులకు లక్ష్యమవుతారు . ఈ అంశాల పై టిటిడి శ్రద్ధ పెట్టి భక్తులకు వన్యప్రాణుల పట్ల అవగాహన కల్పిస్తుందని ఆశిద్దాం.

విజి'లెన్స్' ఎక్కడ..?

వసూళ్లదందాలో వారిదే పైచేయి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

అక్రమాలు అన్యాయాలకు పాల్పడుతున్న వారిని పసిగట్టి సక్రమ మార్గం వైపు నడిపించి వినియోగదారులకు మేలు చేయాల్సిన విజిలెన్స్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అక్రమదారులకు అండగా నిలుస్తున్న వైనం విస్మయానికి గురిచేస్తోంది. ఆ విభాగంలో జరుగుతున్న అక్రమాలు తెలిసి కూడా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం గమనార్హం.



తిరుపతి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధికారులు, ఇద్దరు సిబ్బంది కలిసి దందా వసూళ్లకు తెరలేపారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా విజంభిస్తుంది. ఉమ్మడి జిల్లాలోని మహిళా మంత్రి నియోజకవర్గం కేంద్రంగా కొంతమంది బియ్యం అక్రమ రవాణాకు పూనుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా పలు నియోజవర్గ కేంద్రాలలో తమ అనుచరులను ఏర్పాటు చేసి వారి ద్వారా పిడిఎస్ బియ్యాన్ని అటు రేషన్ షాపుల నుంచి నేరుగా, మరోవైపు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమ రవాణా చేస్తున్నారు. బియ్యం వ్యాపారంలో సిండికేట్‌గా తయారై, ఎవరైనా సరే అక్రమ రవాణా తన అదుపు ఆధ్వర్యంలోనే చేయాలని హుకుం జారీ చేసి, అక్రమ రవాణాకు 'బాస్'గా వ్యవహరిస్తున్నాడు. గతంలో ఇతనిపై అనేక కేసులు నమోదైనా ఖాతరు చేయడం లేదు. అక్రమ సంపాదనతో కోట్లకు పడగలెత్తిన అతనికి గతంలో ఇక్కడే పోలీస్ అధికారిగా పని చేస్తూ,, ప్రస్తుతం విజిలెన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అధికారి అండగా నిలుస్తున్నాడన్న విమర్శలున్నాయి. అతనితో పాటు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్మెంట్స్ లో మరో ముగ్గురు అతనికి సహకరిస్తూ, అక్రమ వ్యాపారాన్ని మూడు పూవులు ఆరు కాయలుగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఓ దశలో అధికారులే స్వయంగా నియోజకవర్గ స్థాయి ఏజెంట్లు ను బెదిరిస్తూ, బియ్యం అక్రమ రవాణా వ్యాపారి కి సహకరించాలని బెదిరింపులకు దిగిన సంఘటనలు కోకొల్లాలు. తమను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. వీరి అండ చూసుకొని ఆ అక్రమ వ్యాపారి జిల్లాలో పెట్రేగి పోతున్నారని పలువురు బహిరంగంగానే గుసగుసలాడుతుండడం కొసమెరుపు. గతంలో వీరిపై ఉన్నత అధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి, తూతూ మంత్రంగా కాస్త బెదిరించి వదిలేయడంతో, వీరు మరింత రెచ్చిపోతున్నట్లు సమాచారం. అక్రమాలపై కొరడా ఝుళిపించి, నిక్కచ్చిగా నిలిచే ఆ విభాగం జిల్లా ఉన్నత అధికారి వీరి పై దష్టి సారించి, దందాలను అరికట్టి, ప్రజలకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

బలమైన ఇనుప తీగలతో కంచె నిర్మించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల నడకదారిలో చిరుత పంజాకు బలైన నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన దినేష్‌కుమార్ కూతురు లక్షిత మృతికి టిటిడి బాధ్యత వహిస్తూ 50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని అఖిలపక్షం డిమాండ్ చేసింది. అలిపిరి నుంచి తిరుమల వరకు బలమైన ఇనుప తీగలతో కంచె నిర్మించాలని సూచించింది. యశోదనగర్‌లోని ఎంబి భవన్‌లో సిపిఎం నగర కార్యదర్శి సుబ్రమణ్యం అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జనసేన నాయకులు మునిశంకర్, ఆమ్‌ఆద్మీ పార్టీ పార్లమెంట్ నాయకులు నగేష్, సిపిఐ నాయకులు శివ, డిఎంసి భాస్కర్‌లు లక్షిత మృతికి నివాళి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

అర్పించారు. వక్తలు మాట్లాడుతూ తిరుమల నడక మార్గంలో భద్రత పటిష్టం చేయాలని, కంచె నిర్మించాలని, లక్షిత మృతికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇస్తూ, కుటుంబంలో ఒకరికి టిటిడి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నడక మార్గం దారి పొడవునా ఇరువైపులా బలమైన ఇనుప తీగలతో కంచె ఏర్పాటు చేయాలన్నారు. శ్రీవారి మెట్టు మార్గంలోనూ ఇదే పద్ధతి అనుసరించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతంలో భద్రతను మరింత పెంచాలన్నారు. తిరుమల మార్గంలో చిరుత దాడి 2010 నుంచి జరుగుతూనే ఉందన్నారు. అయినా టిటిడి పాలకమండలి ఏమాత్రం పట్టించుకోకుండా భక్తుల భద్రతపై దృష్టి సారించకుండా చోద్యం చూస్తోందన్నారు. భక్తులకు రక్షణ కల్పించాలని టిటిడి ఛైర్మన్‌ను అఖిలపక్షం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, కె.వేణుగోపాల్, ఎం.నరేంద్ర, పి.చిన్నా, మునిరాజా, టి.రాధ, వివిఎస్ మణ్యం, తంజావూరు మురళి పాల్గొన్నారు.

'ఆపరేషన్ చిరుత' ముమ్మరం

లక్షిత మృతితో ఆపరేషన్ చిరుతను ముమ్మరం చేశారు. తిరుపతి నడక మార్గంలో బాలికపై దాడిచేసి, ప్రాణాలు తీసిన నేపథ్యంలో అటవీ పరిసర గ్రామాలలో అటవీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. చిరుతను బంధించేందుకు ఆపరేషన్ చిరుత ముమ్మరంగా సాగుతోంది. బాలికపై చిరుత దాడిచేసిన అటవీ ప్రాంతంలో రెండు బోన్లు ఏర్పాటు చేసి, ట్రాప్‌కెమెరాలతో చిరుత కదలికలను అటవీ శాఖ పర్యవేక్షిస్తోంది. తిరుమల మొదటి ఘాట్ 35వ మలుపు వద్ద చిరుత కదలికలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వెహికల్ సైరన్ చేసి చిరుతను విజిలెన్స్ సిబ్బంది అడవిలోకి తరిమినట్లు చెప్పారు. కాలినడక వెళ్లే భక్తులను కట్టుదిట్టమైన భద్రత మధ్య గుంపులు గుంపులుగా పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



చిన్నారులకు ట్యాగ్ వేస్తూ...



శ్రీవారి సేవలో...

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - తిరుమల/ తిరుచానూరు

తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ గవాయ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఛైర్మన్ తీర్థప్రసాదాలను, శ్రీవారి ఫొటో, నమామి గోవిందం కిట్, అగరబత్తీలు, డ్రైఫ్లవర్ టెక్నాలజీతో తయారు చేసిన స్వామివారి ఫొటోను అందజేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఎపి హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శ్రీ బేడీ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్

తిరుమల : ఆజాదీ కా అమత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా దేశమంతా మేరా మిట్టీ – మేరా దేశ్ (నా భూమి – నా దేశం) అనే నినాదంతో చేపడుతున్న కార్యక్రమాన్ని దేశంలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ క్యాబినెట్ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ అన్నారు. తిరుమల తిరుపతి పర్యటనలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న కేంద్ర మంత్రికి ఘన స్వాగతం లభించింది. అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం చెన్నై కి బయల్దేరి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రేడియో స్టేషన్ తిరుపతి హెడ్ డిడి బాల సుబ్రమణ్యం, ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ హెడ్ సుధాకర్ మోహన్, టిటిడి మాజీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డిలు స్వాగతం, వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న క్రికెటర్ రోహిత్ శర్మ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారిని టీమ్‌ఇండియా క్రికెటర్ రోహిత్ శర్మ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం రోహిత్ శర్మ కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనం కోసం తిరుమలకు వెళ్లారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

అమ్మవారి సేవలో టీటీడీ ఛైర్మన్ దంపతులు

తిరుచానూరు: టీటీడీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం భూమన కరుణాకర రెడ్డి ఆదివారం కుటుంబసమేతంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఛైర్మన్‌కు జేఈవో వీరబ్రహ్మం, డెప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులు ఛైర్మన్ దంపతులకు ఆశీర్వచనం చేసి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.



ఏపీఎల్ క్రికెట్ క్రీడాకారులకు మద్దతుగా 3కె రన్..!

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆంధ్రా ప్రీమియర్ లీగ్ రెండవ సీజన్ క్రికెట్ మ్యాచ్‌లు ఈనెల 16వ తేదీ నుంచి విశాఖపట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియంలో ప్రారంభం కానున్నాయి. ఈ శుభసందర్భంగా అక్కడి క్రికెట్ క్రీడాకారులకు మద్దతుగా మ్యాచ్ లు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోషియేషన్ వారు 3కె రన్ నిర్వహించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సమీపంలోని తారక రామస్టేడియం నుంచి 3కె రన్ ను ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ప్రారంభించారు. తారకరామ స్టేడియం నుంచి బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్, క్రిష్ణాపురం ఠాణా, గాంధీరోడ్డు చివరి వరకు 3కె రన్ ను నిర్వహించారు.

సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రీజినల్ స్థాయి ఫుట్బాల్ పోటీలు 13(సబ్ జూనియర్) ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక తుమ్మలగుంట మైదానంలో 13 సంవత్సరంలోపు బాల బాలికలకు తిరుపతి జిల్లా అన్నమయ్య జిల్లా నెల్లూరు జిల్లా, చిత్తూరు జిల్లాల మధ్యన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగాయి. ఈ పోటీల ప్రారంభోత్సవానికి తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీధర్, పెన్నా భాస్కర్ విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు వై ప్రవీణ్ మాట్లాడుతూ క్రీడా మైదానానికి వెళ్లే క్రీడాకారులకు ఏ రుగ్మతలు రావని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లాఫుట్బాల్ సంఘ అధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప, సీనియర్ క్రీడాకారులు పి రామచంద్రారెడ్డి ,వి .మునయ్య , శ్రీనివాసులు ప్రభాకర్, డైనమాస్ ఫుట్బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట మండల పరిధిలోని అటకానితిప్పలో సిఐటియు అనుబంధ సూళ్ళూరుపేట కార్మిక సమాఖ్య సఫాయికర్మచారి విభాగము మీటింగు ఆదివారం జరిగింది. ఈ సభకు హాజరైన గౌరవ అధ్యక్షుడు కె. సాంబశివయ్య మాట్లాడుతూ షార్ అధికారులు వేతనము ఆర్డర్లు సకాలములో ఇవ్వడములేదని, కార్మికులకు కనీస వేతనము బట్వాడా కావడము లేదన్నారు. కరోనా టైములో



తగ్గించిన కార్మిక సంఖ్యను పునరిద్ధరించాలని కోరారు. చాలా కాలంగా పెండింగులో వున్న వేతన బకాయిలు చెల్లింపు విషయములో సిఐటియు, కాంట్రాక్టరు, ముఖ్య యజమాని (షార్) లేబరు అధికారులు సమక్షంలో జరిగిన రాజీ చర్చలు ఒక కొలిక్కి రానికారణంగా, తదుపరి చర్యకు జనరల్ బాడి అనుమతినిచ్చింది. కార్మికులు బయటనుండి వచ్చిన వలస కార్మికులకు ప్రాధాన్యతనిచ్చి స్థానిక పునరావాసులను పనులు తగ్గిస్తున్నారన్నారు. ఈ విషయము షార్ మేనేజిమెంట్ దృష్టికి తీసుకపోవాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మీటింగుకు కె.నాగేశ్వర రావు, జయరామిరెడ్డి తదితర సమాఖ్య లీడర్లు, సభ్యులు హాజరయ్యారు.

పుత్తూరులో క్రైస్తవుల శాంతియుత ర్యాలీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

మణిపూర్ లో క్రైస్తవులను, మహిళలను నగ్నంగా చేసి అత్యాచారాలకు పాల్పడి హత్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివారం పుత్తూరులో క్రైస్తవ సంఘాలు, చర్చి సంఘ పాస్టర్ సంఘ సభ్యులు ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఆర్ డి ఎం నుండి పురవీధుల్లో ర్యాలీ చేసుకుంటూ అంబేద్కర్ సర్కిల్ వరకు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శరత్ బాబు. మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు మణిపూర్ హింసను ఆపాలని, మణిపూర్ మహిళలను రక్షించాలని. చర్చిల కూల్చివేతను ఆపాలని, మత విభేదాలన్నీ ఆపాలని, అడవుల్లో ఉన్న మణిపూర్ ప్రజలను రక్షించాలన్నారు. మానభంగం చేసి హత్య చేసిన మానవ మగాలను ఉరితీయాలన్నారు. ఈ కార్యక్రమం లో. చర్చి పాస్టర్లు సెల్వం, పాల్ రాజ్, విలియం, మిల్టన్, జాన్ కెనడి , జాన్సన్ అబ్రహం, జ్యోతి, విజయ్ కుమార్, ఐజాక్, మురళి, కుప్పయ్య, జయరావ్, ప్రవీణ్ పాల్గొన్నారు .



అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం/ సూళ్లూరుపేట

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 614వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని పీవీఆర్ కళ్యాణ మండపంలో శనివారం సాయంత్రం నెల్లూరు అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ, శ్రీవాణి (శ్రీసిటీ సాహిత్య ఆధ్యాత్మిక వేదిక) ఆధ్వర్యంలో సంగీత, నత్య కచేరీ నిర్వహించారు. రెండున్నర గంటలపాటు సాగిన ఈ కార్యక్రమంలో టీటీడీ శ్వేతా మాజీ డైరెక్టర్ భూమన్, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన ప్రముఖ గాయకులు సరస్వతీ ప్రసాద్, నెల్లూరు గురుకపా కళాక్షేత్రానికి చెందిన నత్య కళాకారిణుల బందం తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమ కన్వీనర్‌గా వ్యవహరించిన తుంగా శివ ప్రభాతారెడ్డి సభకు స్వాగతం పలుకుతూ,



విలక్షణమైన శైలిలో చర్చ, పాట, నత్యం మేళవించి 'అన్నమయ్య సంకీర్తనావళి' పేరుతో ఈ చక్కటి నత్యరూపక కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. శ్రీవాణి ఫోరం ద్వారా ఈ కార్యక్రమానికి సహకరించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. తాళ్లపాక అన్నమాచార్య విలక్షణమైన రచనా శైలి గురించి భూమన్ వివరించారు. సమాజంలో ప్రబలంగా ఉన్న వివక్ష, ఇతర సామాజిక రుగ్మతలను వ్యతిరేకిస్తూ, సమానత్వాన్ని బోధించడం ద్వారా అన్నమయ్య సమ సమాజ మార్గ దర్శకులుగా నిలిచాడని భూమన్ పేర్కొన్నారు. శ్రీసిటీ ఎండీ తండ్రి సన్నారెడ్డి రాజగోపాల రెడ్డి, భూమన్ తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు సంగీత నత్య కార్యక్రమంలో పాల్గొన్న వారిని సత్కరించడంతో పాటు అందరికీ అన్న ప్రసాదాలు అందజేశారు.

సూళ్లూరుపేటలోని శ్రీ మద్వెంకట రామమూర్తి ఆలయంలో శనివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నమాచార్యులు 614వ జయంతిని పురస్కరించుకుని సంకీర్తనా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ అనంతకుమార్ దీక్షితులు, కార్యనిర్వాహకులు కొండూరు వెంకటేశ్వర్లు, మదరపాక సురేష్ పాల్గొన్నారు.

'దండి మార్చ్' ప్రారంభోత్సవ ఏర్పాట్లు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నగరంలోని ముత్యాలరెడ్డి పల్లి కూడలిలో దండిమార్చి విగ్రహాల ప్రారంభోత్సవానికి, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేస్తున్న జాతీయ జెండా పనులను నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదివారం పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నం ఇంజినీరింగ్ అధికారులతో కలసి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సామవాయి మార్గంలో ఏర్పాటు చేస్తున్న 100అడుగుల జాతీయ జెండా పనులను పరిశీలించారు. అలాగే రాయలచెరువు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న పెయింటింగ్ పనులను, ముత్యాలరెడ్డి కూడలి వద్ద దండి మార్చ్ విగ్రహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోమవారం విగ్రహాల చుట్టూ రైలింగ్, విగ్రహాలు బాగా కనిపించేలా ప్రత్యేకంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. చూపరులను ఆకట్టుకునేలా కూడలిని సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. సోమవారం సాయంత్రానికి 100 అడుగుల జాతీయ జెండా పనులను పూర్తి చేయాలన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న పెయింటింగ్ పనులు మరింత సుందరంగా ఉండేలా చేయించాలన్నారు. కాగా సోమవారం సాయంత్రం దండి మార్చ్, మంగళవారం ఉదయం జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. కమిషనర్ వెంట డి.ఈ.లు సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్ తదితరులు ఉన్నారు.

గురువులకు పూర్వ విద్యార్థుల సన్మానం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: విలువలతో కూడిన విద్యను అందించడంతో మంచి సమాజం పుట్టుకొస్తుందని విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటకష్ణంనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆంధ్రకేసరి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం మాటాడుతూ గురువులను 27 సంవత్సరాల తర్వాత గుర్తుపెట్టుకొని సన్మానించడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. అనంతరం గురువులు వెంకట కృష్ణమనాయుడు, బాల సుబ్రహ్మణ్యం, వసంతమ్మ, కన్నెమ్మ, విజయలక్ష్మి, వరలక్ష్మి, గీత, జయశ్రీ, వెంకట కష్ణ, నాగేంద్రలను శాలువాల తో సన్మానించి జ్ఞాపికలను అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేష్, మునిరాజ, సాయి ప్రసాద్, అమీర్ బాషా, మునిరాజా, ప్రవీణ్, రాజకుమార్, రాజవేలు, కుమార్, శరవణ శిల్పా, సుభద్ర, లత, ఈశ్వరి, రజియా, వెంకటేష్, మహేష్ తిరుమల పాల్గొన్నారు.

15న మెగా రక్తదాన శిబిరం



ప్రజాశక్తి-ఏర్పేడు: మండల కేంద్రంలోని వినాయకుని ఆలయం ప్రాంగణంలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యువ సమాజ్ నిర్మాణ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని అవగాహన కల్పించారు. మెకానిక్ మూవీ దర్శకులు, రచయిత మునిశేఖర్, సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గానుగపెంట రమేష్, రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, దర్శకుడు మునిశేఖర్, సభ్యులు హరీష్, అశోక్, శివ, యశ్వంత్, మోహిత్, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రికెట్ కిట్

ప్రజాశక్తి-ఏర్పేడు: పల్లం గ్రామానికి చెందిన హరికృష్ణ తన కుమారుడి జన్మదినం సందర్భంగా ఎస్సీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు రూ.10 వేలు విలువైన క్రికెట్ కిట్‌ను ఆదివారం అందించారు. వార్డెన్ రవి దాతకు హాస్టల్ విద్యార్థుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

ఝాన్సీరాణికి డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని బద్దెపూడి ఝాన్సీరాణికి డాక్టరేట్‌ను ప్రదా నం చేసినట్లు పరీక్షల నియంత్రణ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. విశ్వవిద్యాలయం విద్యావిభాగం ఆచార్యులు టి.జి. అముదవల్లి పర్యవేక్షణలో "ఎఫెక్ట్ ఆఫ్ కోపరేటివ్ లెర్నింగ్ స్ట్రాటజి ఆన్ అఛీవ్మెంట్ మోటివేషన్, టెస్ట్ యాంగ్జైటీ, అఛీవ్మెంట్ ఇన్ బయోలాజికల్ సైన్స్ అమాంగ్ క్లాస్ స్టూడెంట్స్ " అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పిం చినట్లు వెల్లడించారు. ఇందుకుగాను ఆమెకు డాక్టరేట్ లభించిందని డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ తెలిపారు. బద్దెపూడి ఝాన్సీరాణికి డాక్టరే ట్ డిగ్రీ రావడంపై పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

గుండ్లూరు కీర్తికి..



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని గుండ్లూరు కీర్తికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షలు అందించిన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆచార్యులు డా. పి. రేణుక మార్గదర్శకత్వంలో "ఎడ్యుకేషనల్ అండ్ వొకేషనల్ ఆస్పిరేషన్స్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు ఇందుకుగాను ఆమెకు డాక్టరేట్ డిగ్రీ ని ప్రదానం చేసినట్లు వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ తెలిపారు. జి.కీర్తి కి డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడంపై పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం, వే ఫౌండేషన్ సహకారంతో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆజాది కా అమత్ మహోత్సవంలో భాగంగా ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు 'భారతదేశం-విజన్ 2047' అనే అంశంపై ఆదివారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన 45 పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను ఆగస్టు 15వ తేదీన అందజేస్తామని తెలిపారు.

లీగ్ పోటీలపై క్రీడాకారుల ర్యాలీ



ప్రజాశక్తి - గూడూరు: గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ సబ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ లీగ్ పోటీలపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం నుండి క్రీడాకారులు ర్యాలీ ప్రారంభించి హాస్పిటల్ రోడ్డు, పాత బస్టాండ్, రైల్వే స్టేషన్ మీదుగా ర్యాలీ చేపట్టారు. సబ్ సెంటర్ నిర్వాహకులు ముని గిరీష్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ లీగ్ క్రికెట్ పోటీలను క్రికెట్ అసోసియేషన్ ప్రారంభిస్తుందని తెలిపారు. ర్యాలీలో నాగేశ్వరరావు, కరీముల్లా, లవ కుమార్, వేగూరు రాజేంద్ర, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు .


కాలువ ఆక్రమణ తొలగేనా..!



- పోరంబోకు స్థలంలో అక్రమ గృహ నిర్మాణం
- నోటీసులు లెక్కచేయని ఆక్రమణదారుడు కుమార్‌రెడ్డి
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-పాకాల : పాకాల పంచాయతీ పరిధిలోని భారతంమిట్ట 11వ క్రాస్ వద్ద సర్వే నంబర్ 1126లోని కాలువ పోరంబోకు భూమితోపాటు కాలువను ఆక్రమణకు గురవుతోంది. పూతలపట్టు మండలానికి చెందిన కుమార్‌రెడ్డి అనే వ్యక్తి గత మూడేళ్ల క్రితం లక్షలు విలువచేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించి గృహ నిర్మాణం చేపట్టేందుకు పునాదులు వేశారు. అయితే అప్పట్లో రెవెన్యూ అధికారులు అడ్డుకొని ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే కూల్చివేయడం జరుగుతుందని సూచించడంతో ఇన్నాళ్లు నెమ్మదిగా ఉండిపోయారు. అయితే కుమార్‌రెడ్డి ప్రస్తుతం మూడేళ్ల తర్వాత అదే స్థలంలో గృహ నిర్మాణం ప్రారంభించి పనులు చేపడుతున్నారు. స్థానికులు అభ్యంతరం తెలిపినా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోగా.. ఏకంగా పైకప్పు వరకు గృహ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. అధికారులు కుమార్‌రెడ్డిని ప్రశ్నిస్తే పాకాలలో అనేక ప్రాంతాల్లో ఆక్రమణలు ఉన్నాయి. మొదట అక్కడ సమస్యను పరిష్కరించి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని.. ఆ తర్వాత తన దగ్గరకు రావాలని అధికారులకే సవాల్ విసురుతున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా చర్యలు తీసుకుంటామంటున్నా గత మూడేళ్లుగా పట్టించుకోకపోవడం దారుణం. ఇకనైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని పాకాల వాసులు కోరుతున్నారు.

నన్ను బ్రోకర్‌ని చేస్తున్నారు



పూతలపట్టు మండలానికి చెందిన కుమార్‌రెడ్డి భారతం మిట్ట వద్ద సర్వేనంబర్ 1126లోని కాలువ పోరంబోకు స్థలంలో నిర్మాణం చేస్తుండటం వాస్తవం. ఇదివరకు ఆయనకు నోటీసులు పంపాం. నిర్మాణాలు చేపట్టరాదని సూచించాం. అయినా గృహ నిర్మాణం చేపడుతున్నారు. విషయాన్ని తహశీల్దార్ల దృష్టికి తీసుకెళ్లాను. పట్టించుకోలేదు. తహశీల్దారు.. కుమార్‌రెడ్డికి మధ్యలో నన్ను బ్రోకర్‌లా మిగిలిపోతున్నాను. ఏమి చేయలేకపోతున్నాను. నన్ను కొడుతామని బెదిరింపులు వస్తున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలి.

- లక్ష్మీపతి, వీఆర్వో, పాకాల గ్రామ పంచాయతీ

వెంటనే ఆక్రమణలు తొలగిస్తాం



నేను పాకాల మండలానికి తహశీల్దారుగా గత మూడేళ్లుగా పనిచేస్తున్నాను. అయితే ఆక్రమణ విషయం నా దృష్టికి రాలేదు. ప్రస్తుతం భారతమిట్ట వద్ద కబ్జాకు గురైనట్లు, అందులో ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు విచారణలో తేలింది. కబ్జాదారుడు పూతలపట్టు మండలానికి చెందిన కుమార్‌రెడ్డిగా గుర్తించాం. వెంటనే నోటీసులు పంపుతాం. వెంటనే ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

- భాగ్యలక్ష్మి, తహశీల్దారు, పాకాల

ముదిరాజులకు నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించాలి



ప్రజాశక్తి -రేణిగుంట: ముదిరాజులకు ప్రత్యక్ష నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని శ్రీకాళహస్తి నియోజకవర్గం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు వల్లమ కన్నయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట రమణయ్య, గౌరవ అధ్యక్షులు కిలారి బత్తినయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ముదిరాజుల ఆత్మీయ పలకరింపు కార్యక్రమం రేణిగుంట మండలంలోని గాజులమండ్యం, కుర్రకాల్వ, కరకంబాడి, దొడ్లమిట్ట బీసీ కాలనీలలో ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ముదిరాజుల ఆత్మీయ పలకరింపులో భాగంగా గాజులమండ్యానికి చేరుకున్న ముదిరాజ్ సంఘం నాయకులను గాజులమండ్యం సర్పంచి గంగారి రమేష్ ముదిరాజ్ సంఘం నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ముదిరాజ్ సంఘ అధ్యక్షులు వల్లమ కన్నయ్య మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులందరినీ ఐక్యం చేసి వారి సంక్షేమం.. అభివద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. నియోజకవర్గంలో సుమారు 20వేలకు పైగా ముదిరాజులు ఉన్నా రాజకీయ పదవుల్లో సరైన గుర్తింపు ఇవ్వడం లేదని..ముదిరాజులకు ప్రత్యక్ష నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని సూచించారు. శ్రీకాళహస్తి, రేణిగుంటల్లో ముదిరాజ్ కమ్యూనిటీ భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం స్థలాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, సంఘ గౌరవ అధ్యక్షులు చిట్టేటి చిన్న, గౌరవ సలహాదారులు తోటకూర కోటేశ్వరరావు, కోశాధికారి బొజ్జల గోవిందస్వామి, యూత్ ప్రెసిడెంట్ ఆకుల గురుమూర్తి, జాయింట్ సెక్రెటరీ రాజా, తిరుపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్రవాడ సతీష్, టౌన్ కమిటీ సభ్యులు కూనాటి ఈశ్వర్, సుబ్రహ్మణ్యం, యూత్ జాయింట్ సెక్రెటరీ మునిరాజా, శివ, వెంకటరత్నం, బాబురావు, శీను, మునెయ్య, రాజేంద్ర, చందు, జయదేవ్, వేణు పాల్గొన్నారు.

బుల్లెట్ సురేష్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్ జన్మదిన వేడుకలు ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో వారి అభిమానులు, మెదియార్ సంఘం నాయకులు, వైసిపి నాయకుల సమక్షంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మొదట పట్టణ నిరాశ్రయుల వసతి గహానికి బీరువాని అందజేసి వద్దులకు అన్నదానం చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరంలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని ప్రారంభించారు. సంతపేట వద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ ఛైర్మన్ భాస్కర్, కార్పొరేటర్లు నవీన్, కుట్టి రాయల్, శ్రీకాంత్, లక్ష్మణన్, జ్ఞాన జగదీష్, ఏకె.రవి, రాజశేఖర్ ముదలియార్, సుందరం, గురు గణేష్, ఉదయ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని చెంగల్రాయ్ నాయుడు చిల్డ్రన్స్ పార్క్‌లో ఆదివారం తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశిబిరం చిత్తూరు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. వైద్యశిబిరంలో 30 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్టు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి తెలిపారు. ఈ కంటి వైద్యశిబిరానికి 140 మంది కంటి సమస్యలున్నవారు పరీక్షలు చేసుకోక అందులో 30 మందికి శాస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి శాస్త్ర చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, రవీంద్ర నాయుడు, భానుప్రకాష్, డాక్టర్ శ్రీధన్య, డాక్టర్ అర్చన అరవింద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

బైరెడ్డిపల్లి: స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ చికిత్సా శిబిరంకు మండలంలోని ప్రజలు 60 మంది హాజరై చికిత్సలు చేయుకున్నారు. వీరిలో 26 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. వీరికి చెన్నై శంకర నేత్రాలయ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయడం జరుగుతుంది. శంకర నేత్రాలయ సిబ్బంది, మురళి క్రిష్ణ, డాక్టర్ శ్రీనివాసులు, చంద్ర, చిన్నప్ప గౌరప్ప పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీలకు వైసీపీలోనే మేలు

- మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మొహిద్దీన్



ప్రజాశక్తి-గూడూరు టౌన్: ముస్లిం మైనారిటీలకు వైసీపీలోనే మేలు జరుగుతోందనిరాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మొహిద్దీన్ అన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని వైసీపీ మైనారిటీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో మైనారిటీ నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి, నెల్లూరు, కడప జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి సయ్యద్ హంజా హుస్సేన్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మాట్లాడుతూ వైసీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఖాదర్ బాషా సారథ్యంలో హర్ దిల్ మే వైఎస్ఆర్ హం సబ్ జగన్‌కే సాత్ అనే బహత్తరమైన కార్యక్రమం రాష్ట్రం మొత్తం మొదలైందన్నారు. ముస్లిం మైనార్టీలకు జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకొని పరిష్కరించడంతోపాటు అన్ని మసీదులను సందర్శించి ఆ ప్రాంత ముస్లింలతో మాట్లాడి వారికి అవసరమైనవి ప్రభుత్వం ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జోనల్ ఇన్‌ఛార్జి సయ్యద్ హంజా హుస్సేనీ మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ముస్లిం మైనారిటీలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కోట ఎంపీటీసీ మైనారిటీ నాయకులు షేక్ మొబీన్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుల ఆదేశానుసారం గూడూరు నియోజకవర్గంలో కి అడుగుపెట్టిన హర్ దిల్ మే వై ఎస్ ఆర్ కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు అభిమానుల సహకారంతో దిగ్విజయంగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మగ్దూమ్, మొబీన్ బాషా, జలీల్, అర్షద్, బాబు, జమీర్, షబ్బీర్, ఖాదర్, అల్లా బక్షు, బాబులు భాయ్, కరీముల్లా పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తల సంక్షేమ కన్వీనర్ త్రిలోక్‌కు సన్మానం




ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం కుప్పం నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సంక్షేమ కన్వీనర్ త్రిలోక్‌కు అభినందనలు తెలియజేసి ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ పదవి ఇవ్వడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భారీ గజమాలతో ఆయనకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు, సర్పంచ్ గోపాల్, యూనిట్ ఇన్‌ఛార్జిలు ప్రకాష్, రమేష్, సంగనపల్లి పార్టీ అధ్యక్షులు పిఎస్.మంజు, మూర్తి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజ్యం నడుస్తోందా..!



ప్రజాశక్తి-బాలాయపల్లి: అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుందా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజ్యం నడుస్తుందా అని టిడిపి కేంద్ర పార్టీ ఉపాధ్యక్షులు వెంపటి మాధవనాయుడు, రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు జన్ని రమణయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పుంగనూరు ఘటనపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు చంద్రబాబు నాయుడుపై రాళ్లదాడి చేసినందుకు నిరసనగా 4వ తేదీ వెంకటగిరి పట్టణంలోని క్రాస్ రోడ్ వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేసినందుకు 3 రోజుల క్రితం మాజీ శాసనసభ్యులు కురుగొండ్ల రామకష్ణ, మరో18 మంది తెలుగుదేశం పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టడాన్ని చూస్తే రాజ్యాంగాన్ని నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కరెంటు కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారని బాలాయపల్లి మండల పార్టీ టఅధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. డక్కిలి మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, వెంకటగిరి రూరల్ మండల అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి, బాలాయపల్లి, మండలాధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జీ రాయి సత్యనారాయణ, తిరుపతి పార్లమెంట్ రైతు విభాగ అధికార ప్రతినిధి దాసరి ప్రభాకర్ నాయుడు, బాలాయపల్లి, డక్కిలి మండలాల ప్రధాన కార్యదర్శులు కూను శ్రీహరి, బల్లమ్ కుమార్, యూనిట్ ఇన్‌ఛార్జి తాళ్లూరు ప్రసాద్ నాయుడు, చెంగరావు, గూడూరు ప్రముఖ డాక్టర్ చంద్రహాస్, కాట్రగుంట బూత్ కన్వీనర్ మురళి, కెవిఆర్, చంద్రశేఖర్, మండల నాయకులు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంతమ్మ కుటుంబానికి మంత్రి పరామర్శ



ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట మండలంలోని గాజులమండ్యం గ్రామంలో మల్లవరం మోహన్ రామిరెడ్డి భార్య మల్లవరం కాంతమ్మ ప్రథమ వర్ధంతిని ఆమె కుమారులు మల్లవరం నరేంద్రరెడ్డి, మల్లవరం రాజేంద్రరెడ్డి, మల్లవరం సురేంద్రరెడ్డి ఘనంగా నిర్వహించారు. ఆదివారం గాజులమండ్యం గ్రామంలో జరిగిన మల్లవరం కాంతమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి ఆర్కే రోజా, రాష్ట్ర మాజీ మంత్రి దివంగత బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి బొజ్జల బందమ్మ పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీ సాయి గణేష్ విద్యాలయం అధినేత ధనంజయ రెడ్డి, జువ్వల ధన కుమార్ రెడ్డి, జువ్వల దయాకర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ సిద్దాగుంట సుధాకర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, ఎంపీపీ కలపాటి హరి ప్రసాద్ రెడ్డి, సర్పంచులు గంగారి రమేష్, నగేశం, వైకాపా పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకి సోదరుల సమావేశం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలో నేడు వాల్మీకి సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి తెలుగుదేశం రాష్ట్ర వాల్మీకి సాధికార కమిటీ కన్వీనర్ పూలనాగరాజు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక రాళ్ల గంగమాంబ ఆలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున మండల వాల్మీకి సోదరులు భారీగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అదేవిధంగా కుప్పం నియోజకవర్గంలోని 4 మండలాల్లోని వాల్మీకి సోదరులు ఆయనకు స్వాగతం పలికి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన కోరారు.

సమిష్టిగా పనిచేద్దాం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిగిరి రెండో సారి ముఖ్యమంత్రిని చేయడానికి కార్యకర్తలు, నాయకులు అందరూ కలిసి సమిష్టిగా పనిచేద్దామని వైసిపి రాష్ట్రసంయుక్త కార్యదర్శి బండి హేమ సుందర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలతో పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కొందరు ఆవేశంతో వర్గవిభేదాల సష్టించడం పట్ల అవేదన వ్యక్తం చేశారు. పెనుమూరు మండలానికి చెందిన కొందరు ప్రతినిధులు డిప్యూటీ సిఎం నారాయణస్వామికి అడ్డంకులు కలిగించి పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడం భావ్యం కాదన్నారు. నారాయణస్వామి అన్ని వర్గాలు, మండలాల అభివద్ధికి కషి చేస్తున్నారని తెలిపారు. అవినీతిరహితంగా నిస్వార్థంగా సేవలు అందిస్తున్న డిప్యూట సీఎంపై స్వార్థంతో అక్కసు పెంచుకోవడం తగదని, నారాయణస్వామి అధికారంలోకి వచ్చిన తరువాత పెనుమూరు మండలంలో పలు అభివద్ధి పనులు చేశారని చెప్పారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అడుగడుగునా ఎదుర్కొంటున్న స్వామికి అందరు అండగా ఉండాలని కోరారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించండి



ప్రజాశక్తి -పాలసముద్రం: ఒత్తిళ్లకు లొంగకుండా తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని ఓటర్ల ప్రత్యేక అధికారి హబీబ్ బాషా పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని స్థానిక పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ప్రత్యేక అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఆధారాలు లేకుండా వేటిని తొలగించరాదని బీఎల్‌వోలకు ఆదేశించారు. డబుల్ ఓటర్ల విషయంలో రాతపూర్వకంగా అంగీకారం తీసుకొని తొలగించాలని సూచించారు. ఓటర్ల జాబితాను తీసుకొని ఆయనే వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా ర్యాలీ

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 15 తేదీన అన్నివర్గాలు సంఘాల ప్రజలతో జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్ళై, నరసింహులు తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం పట్టణంలోని వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు ఆనందబాబు మాట్లాడుతూ 15వ తేదీ ఉదయం 10.45 ప్రారంభమయ్యే ఈ ర్యాలీ ఎన్జీఓహోం (మిట్ట పైన) నుండి ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పత్రికలు మరియు మీడియా రంగం, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సేవకులు, వెలుగు మహిళలు, విద్యార్థులు, రైతన్నలు, ప్రజలు హాజరు కావాలని కోరారు.విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గురు రాజారావు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు పళని, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ హరినాథ్, శ్రీపురం సీతారామయ్య, గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం మునిరాజు, బేరిసంఘం, వన్నియ కుల క్షత్రియ సంఘం, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నారు.

గగన్యాన్ ప్యారాచూట్ పరీక్షలు విజయవంతం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థలోని విఎస్ఎస్‌సి, డిఆర్‌డిఓ వారి సహకారంతో గగన్యాన్ ప్యారాచూట్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. చండీఘర్‌లోని ఆర్‌టిఆర్ఎస్‌లో ఈ పరీక్షలు జరిపారు. భవిషత్‌లో గగన్యాన్ రాకెట్ ద్వారా మానవ సహిత రాకెట్లను అంతరిక్షం లోకి పంపినప్పుడు అవి తిరిగి భూమి మీదకు సురక్షితంగా చేరుకోవడానికి వాటి వేగాన్ని నియంత్రించడానికి శాస్త్రవేత్తలు ప్యారాచూట్లు రూపొం దించారు. ప్యారాచూట్ల సామర్థ్యాన్ని వాటి పని తీరు పరీక్షలను ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది.

Before The III Addl. Motor Accidents Claims Tribunal: Nellore
M.V.O.P.No. 524 / 2022

Eega Ramanamma - Claimant
Vs
1. **Manjula Sekhar** and 5 others - Respondents

Notice to 1st Respondent

Manjula Sekhar, W/o **Sekar,** Owner of the Lorry bearing Reg.No.AP-26-TD-9843, Residing at Machala Gunta Doravari Satram, Tirupati District.

పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే30-08-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎస్.నరసింహ మూర్తి, బి.కాం., బి.ఎల్.,
ఎస్.శ్రీధర్, బి.కాం., బి.ఎల్.,
క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్స్, నెల్లూరు.